సాక్షి అనకాపల్లి

గురువారం । 30 । నవంబర్ । 2023



సమస్యల పరిష్కారానికి..

కె.కోటపాడులో జరిగిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. 153 వినతులు వచ్చాయి. 8లో



ప్రజారోగ్యానికి పెద్ద పీట

యలమంచిలిలో రూ.3 కోట్లతో నిర్మించిన కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఎమ్మెల్యే రమణ మూర్తిరాజు ప్రారంభించారు. 8లో



విశేషంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

మత్స్యకారులు వేటకు వెళ్లరాదు

అచ్యుతాపురం (అనకాపల్లి): వచ్చే నెల 7వ తేదీలోగా తుఫాన్ సంభవించే అవకాశం ఉన్నందున సముద్రంలోకి వేటకు వెళ్లరాదని మత్స్యశాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఈ మేరకు పూడిమడక, రాంబిల్లి గ్రామాల్లో చాటింపు వేయించారు.

6న జీవీఎంసీ కౌన్సిల్

డాబాగార్డెన్స్: జీవీఎంసీ సర్వసభ్య సమావేశం (కౌన్సిల్) డిసెంబర్ 6న నిర్వహించనున్నారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన ఆ రోజు ఉదయం 11 గంటల నుంచి నిర్వహించనున్న కౌన్సిల్ సమావేశంలో రూపొందించిన 18 అజెండా అంశాలతో పాటు మరికొన్ని టేబుల్ అంశాలు సభ్యుల ఆమోదానికి చర్చకు రానున్నాయి. వీటిలో ప్రధానంగా.. 4.37 ఎకరాల్లో గ్రౌండ్+4 అంతస్తుల్లో (సుమారుగా 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం) రూ.99.47 కోట్లు అంచనా వ్యయంతో నిర్మించనున్న జీవీఎంసీ హెడ్ క్వార్టర్ చర్చకు రానుంది. జీవీఎంసీ పరిధిలో 110.51 కిలోమీటర్ల సెంట్రల్ మీడియన్స్‌ల పర్యవేక్షణ, 34 కిలోమీటర్ల గ్రీన్‌బెల్ట్‌ల పర్యవేక్షణ, 172 పార్కులు, అభివృద్ధి దశలో ఉన్న 7 థీమ్ పార్క్‌లు, రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వహిస్తున్న కాలనీ పార్కుల పర్యవేక్షణ, 57 ట్రాఫిక్ ఐల్యాండ్స్ పర్యవేక్షణ తదితర అంశాలను చర్చించనున్నారు. గ్రీనరీ అభివృద్ధి, నిర్వహణకు అందుబాటులో ఉన్న సిబ్బందితో ప్రజలు, పర్యాటకుల సంతృప్తి మేరకు గ్రీనరీ అభివృద్ధికి సాధ్యం కాకపోవడంతో జోన్‌కి ఒక జోనల్ హార్టికల్చర్ అధికారిని నియమించనున్నారు. మొత్తం ఎనిమిది మందిని మూడేళ్ల కాంట్రాక్ట్ పద్ధతిలో నెలకు రూ.25వేలు వేతనంతో తీసుకోనున్నారు.

రేపటి నుంచి చేనేత ఉత్పత్తుల ప్రదర్శన



మాట్లాడుతున్న సీసీఏపీ ప్రతినిధులు

బీచ్ రోడ్డు (విశాఖ): క్రాఫ్ట్స్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(సీసీఏపీ) ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి వసంతం–2023 పేరుతో హస్తకళలు, చేనేతల ఉత్పత్తుల ప్రదర్శన నిర్వహించనున్నట్టు సీసీఏపీ ప్రతినిధులు అమ్మాజీ తెలిపారు. నగరంలోని ఒక హోటల్‌లో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. రామ్‌నగర్‌లోని గ్రీన్ పార్క్ హోటల్ లో శుక్ర, శనివారాల్లో ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రదర్శన ఉంటుందన్నారు. ఏపీ, తెలంగాణ, కేరళ, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, అస్సాం, మణిపూర్, ఢిల్లీ, రాజస్థాన్ తదితర ప్రాంతాల్లో సేకరించిన ఉత్పత్తులను ప్రదర్శిస్తామన్నారు. ప్రారంభోత్సవం రోజున చేనేత వస్త్రధారణతో ఫ్యాషన్ షో నిర్వహించనున్నట్టు తెలిపారు.

కళా ఉత్సవ్ పోటీలు

భీమునిపట్నం: ఉమ్మడి విశాఖ జిల్లాకు సంబంధించిన జిల్లా స్థాయి కళా ఉత్సవ్–23 పోటీలు డిసెంబర్ 11, 12 తేదీల్లో భీమిలిలోని జిల్లా విద్యాశిక్షణ సంస్థ(డైట్)లో జరుగుతాయని ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్ తెలిపారు. 9వ తరగతి నుంచి ఇంటర్ చదువుతున్న విద్యార్థులు అర్హులని, ఇందులో పది కళారూపాలకు సంబంధించి పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఒక్కో కళారూపానికి ఒక్కో పాఠశాల నుంచి ఒక బాలుడు, ఒక బాలిక మాత్రమే పాల్గొనాలని, గత పోటీల్లో మొదటి, ద్వితీయ స్థానాల్లో నిలిచినవారు అనర్హులని తెలిపారు. వివరాలకు 9573573065 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

7 నుంచి అంతర పాలిటెక్నిక్ క్రీడోత్సవాలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కాశీవిశ్వనాథం

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్)లో ప్రాంతీయ స్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ క్రీడోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. గైస్ ఆధ్వర్యంలో వచ్చే నెల 7 నుంచి 9వ తేదీ వరకు ఈ పోటీలు జరగనున్నాయి. ఈ మేరకు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ ఆధ్వర్యంలో బుధవారం కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో పోటీలకు సంబంధించిన పోస్టర్లను విశ్వనాథ స్పోర్ట్స్ క్లబ్ అధినేత, ఏపీ వాడో కాయ్ కరాటే సంఘం చైర్మన్ బొడ్డేటి కాశీవిశ్వనాథం ఆవిష్కరించారు.

దివ్యాంగులకు డిజిటల్ భవిత

- సహిత విద్యకు సైతం ప్రభుత్వం ప్రాధాన్యం
- దివ్యాంగ విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ
- వినియోగంపై శిక్షణ



దివ్యాంగ విద్యార్థినికి ట్యాబ్ వినియోగం నేర్పుతున్న సహిత ఉపాధ్యాయుడు

చోడవరం రూరల్: రాష్ట్రంలో విద్యారంగ అభివృద్ధిని 'అమ్మ' లాగా తమ 'ఒడి'లోకి తీసుకున్న వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం దివ్యాంగ విద్యార్థుల శ్రేయస్సును, 'భవిత'ను సైతం తన భుజాన వేసుకుంది. గతంలో దివ్యాంగులకు విద్య అనేది అందని ద్రాక్ష మాదిరిగా ఉండేది. ఎక్కడో జిల్లా కేంద్రంలోనో, పొరుగు జిల్లాలోనో దివ్యాంగులకు పాఠశాలలు ఉండేవి. అక్కడ దివ్యాంగ విద్యార్థులను చేర్పించడం, సరైన విద్యను అందించడం ఇటు దివ్యాంగ విద్యార్థులకు అటు వారి తల్లిదండ్రులకు తీరని భారంగా ఉండేది. నేడు ప్రతి మండలంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో జగనన్న ప్రభుత్వం సమగ్ర శిక్ష కార్యక్రమంలో భాగంగా దివ్యాంగ విద్యార్థులకు సహిత విద్యా వనరుల కేంద్రా(భవిత)లను ఏర్పాటు చేసి వారికి మెరుగైన విద్యను అందిస్తున్నది. వీరికి సాధారణ విద్యార్థుల మాదిరిగా డిజిటల్ విద్యను సైతం అందించాలన్న దృఢ సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు దివ్యాంగులు, వారి తల్లిదండ్రులే గాకుండా పలువురి మన్ననలను అందుకుంటున్నవి. వీరికి కూడా ట్యాబ్‌లను అందచేసి వారి కలలను సాకారం చేసింది. అందులో వినికిడి లోపం, దృష్టి లోపం ఉన్న దివ్యాంగులకు ట్యాబ్‌లను అందచేసినంత మాత్రాన డిజిటల్ విద్య వీరికి చేరేదెలా అన్న సందేహం ఎలాంటివారికైనా రాకమానదు. అందుకనే రాష్ట్ర విద్యాశాఖ వీరికి ట్యాబ్‌లతోపాటు దివ్యాంగుల వినియోగానికి వీలుగా 33 రకాల ప్రత్యేక యాప్‌లను వాటిలో అనుసంధానం చేసి మరీ అందచేసింది.



దివ్యాంగ విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేసిన ప్రభుత్వ విప్ ధర్మశ్రీ (ఫైల్)

జిల్లాలో 24 భవిత కేంద్రాల్లో...

అనకాపల్లి జిల్లాలోని 24 భవిత కేంద్రాల్లో విద్యార్జన చేస్తున్న సుమారు 165 మంది వినికిడి, దృష్టి లోపాలు గల దివ్యాంగులకు సుమారు రూ.50 లక్షల విలువ చేసే శాంసంగ్, లెనోవా వంటి బ్రాండెడ్ ట్యాబ్‌లను అందచేసి వారికి డిజిటల్ విద్యను అందేలా చేసింది. సహిత విద్యా కేంద్రంలోని ప్రత్యేక ఉపాధ్యాయుడు వీరికి ఈ ట్యాబ్‌లను ఏరీతిన వినియోగించుకోవాలి.. అన్న అభ్యసనను నేర్పుతున్నారు.

సాధారణ విద్యార్థుల మాదిరిగానే సహిత విద్య



సహిత విద్యా కేంద్రంలోని దివ్యాంగ విద్యార్థులకు సాధారణ విద్యార్థుల మాదిరిగానే విద్యాబోధన అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. దీంట్లో భాగంగానే భవిత కేంద్రాలలో విద్యనభ్యసించే వినికిడి, కంటిచూపు లోపాలున్న విద్యార్థులకు డిజిటల్ విద్యాభ్యాసన మేలు కలిగిస్తుందని ప్రభుత్వం వారికి ట్యాబ్‌లను అందచేసింది. అనకాపల్లి జిల్లా పరిధిలో 24 భవిత కేంద్రాలలో వినికిడి, కంటిచూపు లోపాలున్న దివ్యాంగులు 165మందిని గుర్తించి, వీరికి ఇటీవల ట్యాబులను అందచేసాం.

–బి.శకుంతల, జిల్లా సమన్వయాధికారి, అనకాపల్లి జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్య

చూపు లేదన్న లోటు తీర్చిన జగనన్న



నేను ఏడవ తరగతి బాలికోన్నత పాఠశాలలో చదువుతున్నాను. భవిత కేంద్రం ద్వారా నాకు జగనన్న ప్రభుత్వం ట్యాబ్ అందించింది. దీని ద్వారా నాకు చదువుకోవడం సులువయ్యింది. చూపు లోపం ఉన్న లోటును జగనన్న తీర్చాడు. ఈ ట్యాబ్ డిజిటల్ విద్య ద్వారా ఇపుడు పాఠాలు నేర్చుకోవడం ఎంతో సౌకర్యంగా ఉంది. నాకిపుడు చదువులో ఉన్నత స్థానానికి ఎదగగలని ధీమా ఉంది.

–ముక్కా హారిక, బుక్కావారి వీధి, చోడవరం

పారిశ్రామిక ప్రగతిలో మరో ముందడుగు



కోడూరు ఎంఎస్ఎంఈ, అచ్యుతాపురం ఇండస్ట్రియల్ పార్క్ మౌలిక వసతుల అభివృద్ధి కార్యక్రమంలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎంపీ సత్యవతి

- కోడూరు ఎంఎస్ఎంఈ లేఅవుట్, అచ్యుతాపురం ఇండస్ట్రియల్ పార్క్ అభివృద్ధి పనులకు శ్రీకారం
- వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

తుమ్మపాల: పారిశ్రామికంగా పురోగమిస్తున్న జిల్లాలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండు కార్యక్రమాలకు భూమి పూజ చేయడంతో అభివృద్ధి పథంలో మరో అడుగు ముందుకు పడిందని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. కోడూరు ఎంఎస్ఎంఈ లేఅవుట్, అచ్యుతాపురం ఇండస్ట్రియల్ పార్క్ మౌలిక వసతుల అభివృద్ధి పనులకు బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి మాట్లాడుతూ కోడూరు ఎంఎస్ఎంఈ లేఅవుట్‌లో కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో రూ.40.57 కోట్లతో మౌలిక వసతులు, అచ్యుతాపురం ఏపీఐఐసీలో క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమం కింద రూ.13.45లతో మౌలిక వసతుల కల్పనకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి మాట్లాడుతూ జిల్లా పారిశ్రామికంగా త్వరితగతిన అభివృద్ధి చెందేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెడుతున్నారన్నారు. ముఖ్యంగా చిన్న, మధ్యతరహా పరిశ్రమలు అభివృద్ధి చెందినట్లయితే జిల్లాలో ఉద్యోగావకాశాలు గణనీయంగా పెరుగుతాయని చెప్పారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బి.వరాహ సత్యవతి, ఏపీఐఐసీ జెడ్ఎం త్రినాథ్, పరిశ్రమల శాఖ జీఎం శ్రీధర్, పరవాడ జెడ్పీటీసీ డి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రేపు మినీ జాబ్ మేళా

తుమ్మపాల: రానున్న డిసెంబర్ 1న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, రేబాకలో మినీ జాబ్ మేళా నిర్వహిస్తునట్టు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి టి. చాముండేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా పరవాడలో గల రిఫ్రా టెక్నిక్ కంపెనీలో అప్రెంటిస్ ట్రైనీ పోస్టుకి ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. డిప్లొమా(మెకానికల్, ఎలక్ట్రికల్) ఐ.టి.ఐ(ఫిట్టర్, వెల్డర్, మెకానికల్, ఎలక్ట్రికల్) చదువుకొని, 18 నుండి 25 ఏళ్ల వయస్సు గల యువకులు పాల్గొనవచ్చన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్.7036363272 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

జగనన్న ప్రభుత్వంలో గీత కార్మికులకు గుర్తింపు

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు
- 40 మందికి గుర్తింపు కార్డుల పంపిణీ



గీత కార్మికులకు గుర్తింపు కార్డులను అందిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

కె.కోటపాడు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బీసీ వర్గాలకు ఎన్నడూ లేని విధంగా సముచిత స్థానం లభించిందని డిప్యూటీ సీఎం, రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండలంలో ఎ.కోడూరు గ్రామానికి చెందిన 40 మంది గీత కార్మికులకు డిప్యూటీ సీఎం చొరవతో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ గుర్తింపు కార్డులు మంజూరు అయ్యాయి. వారికి తారువ క్యాంప్ కార్యాలయంలో బుధవారం డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చేతుల మీదుగా గుర్తింపు కార్డులను అందించారు. ఈ సందర్భంగా బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ బీసీ వర్గాల్లో ఉప కులాల వారికి ప్రత్యేకంగా రాష్ట్ర స్థాయి కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే గీత కార్మికులకు మేలు జరిగిందన్నారు. గుర్తింపుకార్డు ఉన్నట్టయితే వారికి ప్రమాద బీమాతో పాటు 50 ఏళ్లు నిండిన వారికి పింఛన్లు కూడా అందనున్నాయని తెలిపారు. గత 20 ఏళ్లుగా తమకు గుర్తింపు కార్డుల కోసం ఎందరినో కలిసినా ప్రయోజనం దక్కలేదని, ప్రస్తుతం డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు సమస్యను తెలిపిన వెంటనే కార్డులను మంజూరు చేయించారని గీత కార్మికులు శెట్టి సూర్యనారాయణ, రాజు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు, ఎంపీపీ రెడ్డి జగన్ మోహన్, జెడ్పీటీసీ కర్రి సత్యం, ఎ.కోడూరు గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షురాలు బొడ్డు ప్రకాశమ్మ, ఎంపీటీసీ లెక్కల గౌతమి, శంకరరావు పాల్గొన్నారు.

త్వరలో 14 డీసీసీబీ బ్రాంచ్‌లు

- ప్రతి మండలంలో సహకార బ్యాంకు శాఖ
- డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు
- నర్సీపట్నంలో నూతన భవనం ప్రారంభం



పీఏసీఎస్, డీసీసీబీ బ్రాంచ్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు

నర్సీపట్నం: ఉమ్మడి విశాఖ జిల్లాలో త్వరలో 14 బ్రాంచ్‌లను ఏర్పాటు చేస్తున్నామని డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు చెప్పారు. నర్సీపట్నంలో రూ.53 లక్షలతో నిర్మించిన పీఏసీఎస్, ది విశాఖ కోఆపరేటివ్ బ్యాంక్ నూతన భవన సముదాయాన్ని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆనాడు డా.వై.ఎస్.రాజశేఖరరెడ్డి సహకార రంగానికి జీవనం పోశారని, నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కోఆపరేటివ్ సొసైటీలను మరింత బలోపేతం చేశారన్నారు. డీసీసీబీ సేవలను రైతులకు మరింత చేరువ చేసేందుకు రాష్ట్రంలో ప్రతి మండలంలో బ్రాంచ్‌లు ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారన్నారు. దీనిలో భాగంగానే ఉమ్మడి జిల్లాలో 14 బ్రాంచ్‌లను త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. వ్యవసాయరంగానికి డీసీసీబీ మొదటి ప్రాధాన్యం ఇస్తుందని, రైతులకు పెట్టుబడి రుణాలను వెనువెంటనే మంజూరు చేస్తోందన్నారు. మరో అడుగు ముందుకేసి డ్వాక్రా సంఘాలకు కూడా రుణాలు ఇస్తుందన్నారు. జిల్లాలో ఇప్పటికే కొన్ని బ్రాంచ్‌ల ద్వారా రుణాలు ఇచ్చే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. సొంత స్థలం ఉండి పెట్రోల్ బంక్‌లు ఏర్పాటుకు ఆసక్తి గల వారికి డీసీసీబీ నుంచి రుణాలు మంజూరు చేస్తామన్నారు. డీసీసీబీలో రూ.2,100 కోట్ల టర్నోవర్ జరుగుతోందన్నారు. నర్సీపట్నం బ్రాంచ్ టర్నోవర్ రూ. 110 కోట్లుగా ఉందన్నారు. ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ మాట్లాడుతూ నర్సీపట్నంలో నూతన భవనం నిర్మించటం అభినందనీయమన్నారు. పీఏసీఎస్‌లు రైతులకు అవసరమైన రుణాలు అందజేసి అండగా నిలుస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్‌చైర్మన్ కోనేటి రామకృష్ణ, ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, డీసీసీబీ మాజీ చైర్మన్ రాజా సాగి రామచంద్రరాజు, డీసీసీబీ జనరల్ మేనేజర్ శ్రీనివాస్, పీఏసీఎస్ అధ్యక్షుడు గుడివాడ సన్యాసినాయుడు, డైరెక్టర్లు గవిరెడ్డి స్వామినాయుడు, గవిరెడ్డి శ్రీను, వైఎస్సార్‌సీపీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, బ్రాంచ్ మేనేజర్ నాయుడు పాల్గొన్నారు.

చెరకు రసనాణ్యత పరీక్షలు ప్రారంభం

గోవాడ సుగర్స్‌లో క్రషింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్న యాజమాన్యం



రసనాణ్యత పరీక్షల యంత్రాన్ని ప్రారంభిస్తున్న ఫ్యాక్టరీ ఎండీ సన్యాసినాయుడు

చోడవరం: ఈ ఏడాది క్రషింగ్ సీజన్‌కు గోవాడ సుగర్ ఫ్యాక్టరీ సర్వం సిద్ధం చేసింది. మరో 15 రోజుల్లో క్రషింగ్ ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేసింది. ముందుగా ఓవరాయిలింగ్ జరిగిన యంత్రాల పనితీరుపై ట్రయల్ రన్ పనులు చేపట్టారు. నాలుగు రోజుల కిందట సెంట్రిఫ్యూగల్ యంత్రాన్ని ప్రారంభించిన యాజమాన్యం బుధవారం చెరకు నాణ్యత పరీక్షలకు శ్రీకారం చుట్టింది. రసనాణ్యత పరీక్ష చేసిన తర్వాత చెరకు పంటకు కటింగ్ పర్మిట్లు ఇస్తారు. ఆ పరీక్షలను ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ వి.వి.సన్యాసినాయుడు బుధవారం ప్రారంభించారు. ఈ ఏడాది క్రషింగ్ సీజన్‌ను డిసెంబరు 15వ తేదీ నుంచి లాంఛనంగా ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. క్రషింగ్ ప్రారంభించే సమయానికి కనీసం రోజుకు 1000 నుంచి 2000 టన్నుల చెరకు ఫ్యాక్టరీకి సరఫరా కావాల్సి ఉంది. రెగ్యులర్ క్రషింగ్ జోరందుకుంటే రోజుకు 3 వేల నుంచి 4 వేల టన్నుల వరకు చెరకు సరఫరా కావాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో ఇప్పటి నుంచే ఫ్యాక్టరీ పరిధిలో ఉన్న చెరకును రసనాణ్యత పరీక్షలు చేసి కటింగ్ పర్మిట్లు ఇవ్వాలని ఫీల్డు సిబ్బందికి యాజమాన్యం ఆదేశాలు జారీ చేసింది. పక్వానికి వచ్చిన తోటలను వ్యవసాయ ఫీల్డు సిబ్బంది గుర్తించి రసనాణ్యత పరీక్షల కోసం ఫ్యాక్టరీకి తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు.

ఖైదీ మృతిపై నేడు మెజిస్టీరియల్ విచారణ

మహారాణిపేట (విశాఖ దక్షిణ): సెంట్రల్ జైలులో ఖైదీగా ఉన్న కాపారపు నాగరాజు మృతిపై ఈనెల 30వ తేదీ ఉదయం 11 గంటలకు మెజిస్టీరియల్ విచారణ చేస్తున్నట్టు విశాఖ రెవెన్యూ డివిజనల్ అధికారి డి.హుస్సేన్ సాహెబ్ ఒక ప్రకటనలో తెలిపారు. నర్సీపట్నం గబ్బాడ గ్రామానికి చెందిన కాపారపు నాగరాజు సెంట్రల్ జైలులో ఖైదీగా ఉన్నారు. ఈ ఏడాది అక్టోబర్ 7వ తేదీన అనారోగ్యానికి గురి కావడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ఆయన 21వ తేదీన చికిత్స పొందుతూ చనిపోయారు. దీనిని లాకప్ డెత్‌గా పరిగణించి మెజిస్టీరియల్ విచారణ చేయాలని విశాఖ కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున నిర్ణయించారు. విశాఖ ఆర్డీవోను విచారణ అధికారిగా నియమించారు. విశాఖ ఆర్డీవో కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు మెజిస్టీరియల్ విచారణ చేస్తున్నామని, నాగరాజు గురించి తెలిసిన వారు ఎవరైనా విచారణకు హాజరై లిఖితపూర్వకంగా తెలియజేయాలని ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

స్వచ్ఛమైన ఓటర్ల జాబితాయే మన లక్ష్యం

- ఎన్నికల అధికారులు సమర్థంగా పనిచేయాలి
- సమీక్ష సమావేశంలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



తుమ్మపాల: జిల్లాలో స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీకి సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఎన్నికల ప్రక్రియపై ఈఆర్వోలు, ఏఈఆర్‌ఓలతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అందరూ బాగా పనిచేస్తున్నారని, పర్యవేక్షణ మరింత మెరుగు పరచుకోవాలన్నారు. క్షేత్రస్థాయి పనులను పర్యవేక్షిస్తూ, జాబితా సవరణను సూక్ష్మ బుద్ధితో పరిశీలించాలన్నారు. ముఖ్యంగా 18 ఏళ్లు నిండిన, 90 సంవత్సరాలు దాటిన ఓటర్ల విషయంలో జాగ్రత్తగా పరిశీలన చేయాలన్నారు. అంతకుముందు జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి నియోజకవర్గాలవారీగా ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియ ఏ విధంగా జరుగుతున్నదీ క్షుణ్ణంగా సమీక్షించారు. బీఎల్‌వో, కంప్యూటర్ ఆపరేటర్ల పనితీరును లోతుగా పర్యవేక్షించాలన్నారు.

9లోగా సవరణలు తెలపాలి

ఓటర్ల జాబితాలో సవరణలను డిసెంబరు 9వ తేదీలోగా తెలియజేయాలని జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టాన్‌శెట్టి రాజకీయ పార్టీలను కోరారు. కలెక్టర్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో గుర్తించిన తేడాలు, తప్పులను పోలింగ్ కేంద్రం వారీగా అధికారికంగా ఇవ్వాలన్నారు. రాజకీయ పార్టీల వారు లేవనెత్తిన నిజమైన లోపాలను వెంటనే సరిదిద్దాలని అధికారులను ఆదేశించారు. డీఆర్వో బి.దయానిధి, అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్, అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీవోలు చిన్నికృష్ణ, జయరాం, ఎస్డీసీలు మహేష్, ప్రమీల గాంధీ, రామలక్ష్మి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు లక్ష్మీదేవి, తహసీల్దార్లు పాల్గొన్నారు.

కొరియర్‌లో గంజాయి రవాణా

- గంజాయి నిలువ ఉన్న ఇంటిపై సీపీ రవిశంకర్ పర్యవేక్షణలో దాడులు
- 200 కిలోల గంజాయి స్వాధీనం
- పరారీలో నిందితులు

అల్లిపురం (విశాఖ): కొరియర్‌లో గంజాయి సరఫరా చేస్తున్నట్లు వచ్చిన పక్కా సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ తెలిపారు. నగర టాస్క్‌ఫోర్స్ పోలీసులు, టూటౌన్ పోలీసులతో కలిసి ఆయన బుధవారం మధ్యాహ్నం టూటౌన్ పరిధి అచ్చియ్యమ్మపేట, జీవీఎంసీ స్కూల్ సమీపంలోని ఓ ఇంటిపై దాడి చేశారు. అక్కడ నిల్వ చేసిన సుమారు 200 కేజీల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గంజాయి కలిగి ఉన్న ఇంట్లో ఉన్నవారు పరారీలో ఉన్నట్లు తెలిపారు. వారు ఇతర రాష్ట్రాలు, దేశాలకు కూడా ఇక్కడ నుంచి ఏడాదిన్నరగా కొరియర్‌లో గంజాయి సరఫరా చేస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. గంజాయితో పాటు అద్దెకు ఇచ్చిన ఇంటిని కూడా సీజ్ చేసినట్లు తెలిపారు. కొరియర్ సంస్థలు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నగరంలో మరికొన్ని చోట్ల గంజాయి సరఫరా చేస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. అక్కడ కూడా ప్రత్యేక బృందాలతో దాడులు నిర్వహిస్తామన్నారు. ఇంటి యజమానులు అద్దెకు దిగేవారి వివరాలను పూర్తిగా కనుక్కొన్న తరువాతే ఇళ్లు అద్దెకు ఇవ్వాలన్నారు. ఇళ్లలో పనిమనుషుల నుంచి కూడా ఆధారంగా ఆధార్ కార్డు తీసుకోవాలన్నారు. గంజాయి రవాణా చేసినా, గంజాయి రవాణా చేసేవారికి సహకరించినా, అటువంటి వారికి ఇళ్లు అద్దెకు ఇచ్చినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడులో డీసీపీ–1, కె.శ్రీనివాసరావు, టాస్క్‌ఫోర్సు ఏసీపీ, ఏసీపీలు, టూటౌన్ సీఐ, ఎస్ఐ సిబ్బంది పాల్గొన్నారు.



ఇంట్లో నిల్వ ఉంచిన గంజాయిని పరిశీలిస్తున్న పోలీస్ కమిషనర్ రవిశంకర్

తండ్రికి తల కొరివిపెట్టిన కుమార్తె

- నాలుగు మాసాల క్రితం తల్లి అకాల మరణం
- నేడు అనారోగ్యంతో తండ్రి మృతి



కె.జె.పురంలో వేగి చిన అమ్మతల్లినాయుడుకు కుమార్తె పావని అంత్యక్రియలు

మాడుగుల రూరల్: తండ్రికి తల కొరివి పెట్టి కన్న రుణం తీర్చుకుంది ఓ కుమార్తె. కె.జె.పురం గ్రామానికి చెందిన వేగి చిన అమ్మతల్లినాయుడు(గాంధీ) (51) రెండు రోజుల క్రితం హఠాత్తుగా గుండెపోటు రావడంతో ఆయనను విశాఖపట్నంలో ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందారు. ఆయన భార్య చిట్టెమ్మ ఈ ఏడాది ఆగస్టు 2వ తేదీన మృతి చెందారు. అప్పటి నుంచి తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. గాంధీకి కుమారులు లేకపోవడంతో ఆయన ఏకైక కుమార్తె పావని బంధువులు, కుటుంబ సభ్యులు వెంటరాగా తండ్రికి తలకొరివి పెట్టింది. ఈ సంఘటనతో బంధువులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరు అయ్యారు. గాంధీ వృత్తి రీత్యా ఎల్ఐసీ ఏజెంటు కూడా పనిచేస్తున్నారు. ఆయన గతంలో కె.జె.పురం పీఏసీఎస్ అధ్యక్షునిగా పనిచేశారు. ప్రస్తుతం మరిడిమాంబ ఆలయం చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. బంధుమిత్రులు కన్నీటితో వీడ్కోలు పలికారు.

సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు

- కె.కోటపాడు జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి విశేష స్పందన
- 153 వినతులను స్వీకరించిన జేసీ, జిల్లా అధికారులు



ప్రజల నుంచి అర్జీలను స్వీకస్తున్న జాయింట్ కలెక్టర్ జాహ్నవి



వినతులను అందించేందుకు క్యూలైన్‌లో ఉన్న ప్రజలు

కె.కోటపాడు: సమస్యల సత్వర పరిష్కారానికి జగనన్నకు చెబుదాం కార్యక్రమం మంచి వేదిక అని అనకాపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్ జాహ్నవి అన్నారు. కె.కోటపాడులో మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న జేసీ జాహ్నవి, ఆర్డీవో చిన్నికృష్ణ, కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దినేష్, ట్రైనీ కలెక్టర్ స్మరణ్‌రాజ్, డ్వామా పీడీ సందీప్ ప్రజల వినతులు, ఫిర్యాదులను స్వీకరించి, పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు వాటిని అందించి, ఆదేశించారు. కార్యక్రమంలో 153 అర్జీలు వచ్చాయి. వీటిలో అత్యధికంగా 81 రెవెన్యూ, 15 పంచాయతీ రాజ్, 10 హౌసింగ్ సంబంధిత సమస్యలపై వచ్చినవే ఉన్నాయి. దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని సమస్యల్లో అవకాశమున్న ప్రతి సమస్యనూ త్వరితగతిన పరిష్కరించనున్నట్లు జేసీ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి హేమంత్, డీపీవో శిరీషారాణి, మండల ప్రత్యేకాధికారులు నాగలక్ష్మి, మంజులవాణి, జిల్లా పశువైద్యాధికారి ప్రసాదరావు, ఏడీ బైరాగి, తహసీల్దార్ జె.రమేష్‌బాబు పాల్గొన్నారు.

వినతులలో కొన్ని

- పాచిలవానిపాలెం గ్రామంలో 200 మంది రైతుల సాగులో ఉన్న రైత్వారీ ఇనాం భూములకు పట్టాలను మంజూరు చేయాలని రైతులతో కలిసి వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ అర్జీ అందించారు. పూర్వం నుంచి సాగులో ఉన్న భూములకు చెందిన రైతులకు ఎటువంటి పట్టాలూ లేకపోవడంతో ప్రభుత్వ లబ్ధిని పొందలేకపోతున్నారని జేసీ దృష్టికి తీసుకెళ్లారు.
- చౌడువాడ గ్రామంలో హైస్కూల్‌కు కూతవేటు దూరంలోనే వైన్‌షాపును నిర్వహిస్తున్నట్లు ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, వార్డు మెంబర్ చల్లా సురేష్ ఫిర్యాదు చేశారు. విద్యార్థినుల ఇబ్బంది దృష్ట్యా తల్లిదండ్రుల కమిటీ సమావేశంలో కూడా వైన్ షాపు తరలింపుపై తీర్మానం చేసినట్లు పేర్కొన్నారు.
- కె.కోటపాడు గ్రామంలోని తన ఎకరా భూమి ప్రస్తుతం సమగ్ర భూ సర్వేలో 90 సెంట్లుగానే నమోదయిందని కొత్తల కామేశ్వరి తెలిపింది. సాగులో ఉన్న ఎకరా భూమి విస్తీర్ణం రికార్డులలో నమోదయ్యేలా చూడాలని అర్జీ పెట్టారు.
- దాలివలస గ్రామంలో 2010 నుంచి సర్వే నెం.182, 193–1ఏలో ఉన్న 5 ఎకరాల భూమిని సాగు చేస్తున్నట్లు రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి పైల అమ్మతల్లినాయుడు తెలిపారు. తన సాగులో ఉన్న భూమిని 2014లో చంద్రయ్యపేటకు చెందిన సబ్బవరపు రామునాయుడు అక్రమించుకున్నట్లు ఆయన ఫిర్యాదు చేశారు.
- లంకవానిపాలెం గ్రామానికి వేపాడ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా జరుగుతోందని, దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఎక్కువగా ఏర్పడుతోందని గ్రామ సర్పంచ్ వేచలపు దొరబాబు తెలిపారు. వేపాడ మండలం నుంచి కాకుండా కె.కోటపాడు నుంచి విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందించారు.
- చౌడువాడ గ్రామంలో కొందరు రైతుల జిరాయితీ భూములను ఐదేళ్ల క్రితం ఎండోమెంట్ అధికారులు రాణీబుచ్చి సీతయ్యమ్మ సత్రం పేరిట రికార్డుల్లో నమోదు చేసినట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, ఆకుల సాయి ప్రసాద్ తెలిపారు. సుదీర్ఘకాలంగా తమ పేరున రెవెన్యూ రికార్డుల్లో సర్వే నెంబర్లతో ఉన్న భూమిని, ఎలాంటి ఆధారాల్లేకుండా రెవెన్యూ అధికారులు ఎండోమెంట్ పేరున నమోదు చేసినట్లు పేర్కొన్నారు. పూర్తి స్థాయి రికార్డులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజారోగ్యానికి సీఎం జగన్ పెద్ద పీట

రూ.3 కోట్లతో నిర్మించిన సీహెచ్‌సీ భవనం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కన్నబాబు



సీహెచ్‌సీ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి

యలమంచిలి: రాష్ట్రంలో ప్రజారోగ్యానికి సీఎం జగన్ మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యతనిస్తున్నారని ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు(కన్నబాబు) అన్నారు. యలమంచిలి పట్టణం తులసీనగర్‌లో రూ.3 కోట్లతో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్‌వర్మ, ఎంపీపీ బోదెపు గోవింద్‌తో కలసి ప్రారంభించారు. ఆస్పత్రి గదులను పరిశీలించారు. అనంతరం ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ యలమంచిలి నియోజకవర్గంలో 30 పడకల ఆస్పత్రిని 50 పడకలకు విస్తరించి, ఆధునిక వైద్య సేవల్ని అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. అత్యవసర చికిత్సలకు ఇన్నాళ్లూ కేజీహెచ్‌కు వెళ్లాల్సి వచ్చేదని, ఇక మీదట ఆ ఇబ్బందులుండవన్నారు. తమ ప్రభుత్వం హయాంలో అన్ని రకాలుగా పట్టణంలో అభివృద్ధి జరిగిందన్నారు. రూ.కోట్ల నిధులతో చెరువుల ఆధునికీకరణ, వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. డిసెంబర్ 4న రైల్వే స్టేషన్ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభిస్తామన్నారు. పట్టణంలో రూ.40 కోట్లతో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు ప్రతిపాదనలకు సీఎం జగన్ సానుకూలంగా స్పందించారని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. శాశ్వత రక్షిత తాగునీటి పథకంలో భాగంగా రూ.101 కోట్లతో చేపట్టిన పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. అంతకు ముందు మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి మాట్లాడుతూ సీహెచ్‌సీ అందుబాటులోకి రావడంతో నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్యం అందనుందన్నారు. కొత్తగా నిర్మించిన సీహెచ్‌సీకి సంబంధించిన పరికరాలను విశాఖ డెయిరీ మాజీ చైర్మన్ దివంగత ఆడారి తులసీరావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు ప్రస్తుత చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ అందజేస్తారని తెలిపారు.

తులసీరావు సేవలు మరువలేనివి

విశాఖ డెయిరీ వ్యవస్థాపకుడు దివంగత ఆడారి తులసీరావు సేవలు మరువలేనివని ఎమ్మెల్యే రమణమూర్తిరాజు అన్నారు. యలమంచిలి నియోజకవర్గంలో నూతనంగా నిర్మించిన సీహెచ్‌సీకి అవసరమైన ఆధునిక వైద్య పరికరాలను ఆయన జ్ఞాపకార్థం విశాఖ డెయిరీ నిధుల నుంచి ఆయన కుటుంబ సభ్యులు అందించడం అభినందనీయమన్నారు. డెయిరీ ద్వారా అందిస్తున్న సేవల్ని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరావు, అర్రెపు గుప్తా, పార్టీ పట్టణ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర, పట్టణ సచివాలయ కన్వీనర్ కర్రి శివ, కొక్కిరాపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు మళ్ల కొండబాబు, మాజీ జెడ్పీటీసీ ఆడారి శ్రీధర్(చిన్నా), మున్సిపల్ కమిషనర్ కె.కొండలరావు, తహసీల్దార్ రాణీ అమ్మాజీ, ఎంపీడీవో అప్పలనాయుడు, యలమంచిలి ప్రభుత్వాస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.



కబడ్డీ జాతీయ పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థి



అరుణ్‌కుమార్

రావికమతం: మరుపాక మోడల్ స్కూల్ విద్యార్థి పసుపులేటి అరుణ్ కుమార్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) జిల్లా, రాష్ట్ర స్థాయి ఆటల పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి, జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. వచ్చే జనవరిలో జరగనున్న జాతీయ పోటీలలో అరుణ్ పాల్గొంటాడని స్కూల్ ప్రిన్సిపాల్ సత్యసునీల్ బుధవారం తెలిపారు. అరుణ్‌కుమార్‌కు చిన్నప్పటి నుంచీ కబడ్డీ ఆటపై మక్కువ ఎక్కువ. ఎస్‌జీఎఫ్ పోటీలలో మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో ప్రతిభ చూపి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యాడు. దీంతో జిల్లా సెలక్షన్ కమిటీ రాష్ట్ర పోటీలకు ఎంపిక చేయగా, చిత్తూరు జిల్లా చౌడేపల్లిలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్–17 విభాగంలో ఉమ్మడి విశాఖ జిల్లా జట్టు తరుపున పాల్గొని ప్రతిభ చూపాడు. దీంతో జాతీయ పోటీలకు రాష్ట్ర జట్టు తరపున ఎంపిక చేశారు. 2024 జనవరి 7 నుంచి తెలంగాణాలోని కామారెడ్డిలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో అరుణ్ పాల్గొంటాడని ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థితోపాటు, పీడీని స్కూల్ సిబ్బంది అభినందించారు.

అనారోగ్యంతో కార్మికుడి మృతి?

అచ్యుతాపురం (అనకాపల్లి): అచ్యుతాపురం సెజ్‌లోని ఒక కంపెనీలో బుధవారం కార్మికుడు ఒకరు అనారోగ్యంతో మృతి చెందినట్టు సమాచారం. ఏ షిఫ్ట్‌లో విధులకు హాజరయిన ఎస్.సత్యారావు (50) గుండెపోటుతో తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందినట్టు తెలిసింది. కార్మికుడి మృతికి వాయు కాలుష్యమే కారణమని, మృతుని కుటుంబానికి రూ.25 లక్షల నష్టపరిహారం అందజేయాలని సీఐటీయూ నాయకుడు ఆర్.రాము డిమాండ్ చేశారు.

రోడ్డుపై పడి వ్యక్తి మృతి



చెవ్వేటి చిననూకరాజు(ఫైల్)

కశింకోట: మండలంలోని బయ్యవరం ఫ్లైఓవర్ వద్ద జాతీయ రహదారిపై బుధవారం ఓ వ్యక్తి నడిచి వెళ్తూ ప్రమాదవశాత్తూ రోడ్డుపై పడిపోయి తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి అందించిన వివరాలు. చింతలపాలెం గ్రామానికి చెందిన చెవ్వేటి చిన నూకరాజు(47) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో ఆస్పత్రికి వైద్యం కోసం వెళ్లడానికి తమ గ్రామం నుంచి బయలుదేరాడు. జాతీయ రహదారి మీదుగా అనకాపల్లి వైపు నడిచి వెళుతుండగా బయ్యవరం ఫ్లైఓవర్ వద్దకు చేరేసరికి ప్రమాదవశాత్తు రోడ్డుపై పడి, తలకు తీవ్ర గాయమైంది. రాయిని తన్నుకుని పడిపోయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. గాయపడిన నూకరాజును 108లో పోలీసులు అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారని ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కుమారుడు కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

పట్టాలు తప్పిన పాసింజర్ రైలు

- రంగంలోకి దిగిన రైల్వే సిబ్బంది
- సింహాచలం రైల్వే స్టేషన్‌లో ఉత్కంఠగా మాక్‌డ్రిల్



రైలు బోగీ నుంచి క్షతగాత్రుడిని కిందకి దించుతున్న సిబ్బంది

గోపాలపట్నం(విశాఖ): ప్రయాణికులతో కూడిన రైలు సింహాచలం స్టేషన్ వద్దకు రాగానే బుధవారం పట్టాలు తప్పింది. దీంతో ప్రయాణికుల హాహాకారాలతో ఆ ప్రాంతం మార్మోగిపోయింది. వెంటనే స్పందించిన రైల్వే అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను అంబులెన్స్‌ల్లో ఆస్పత్రులకు తరలించారు. రైలు బోగీలను కట్ చేసి ప్రయాణికుల్ని బయటకు తీసుకొచ్చారు. ఇదంతా వాస్తవం అనుకుంటే పొరబడినట్టే.. పాత గోపాలపట్నం రహదారిలో సింహాచలం రైల్వే స్టేషన్ వెనుక ట్రాక్‌పై వాల్తేర్ డివిజన్ రైల్వే అధికారులు బుధవారం నిర్వహించిన మాక్‌డ్రిల్ ఉత్కంఠ భరితంగా సాగింది. రైలు ప్రమాద సమయంలో ఏవిధంగా సహాయక చర్యలు చేపట్టాలో అవగాహన కల్పించారు. పట్టాలపై పడి ఉన్న భోగీలను భారీ క్రేన్ సహాయంతో తొలగింపు చర్యలు చేపట్టారు. ఈ మాక్‌డ్రిల్‌ను రైల్వే డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ పరిశీలించారు. ఏయే విభాగాలు ఎలా పని చేశాయో అడిగి తెలుసుకున్నారు. ఏడీఆర్‌ఎం(ఆపరేషన్స్) మనోజ్‌కుమార్, ఏడీఆర్‌ఎం(ఇన్‌ఫ్రా) సుధీర్‌కుమార్‌గుప్త, సిద్ధార్థనాథ్‌ప్రదాన్ పర్యవేక్షణలో ఆర్‌పీఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్, రైల్వేకు చెందిన పలు విభాగాలు పాల్గొన్నాయి. జీఆర్‌పీ, గోపాలపట్నం పోలీసులు, ప్రైవేటు అంబులెన్సులు సహకారం అందించాయి.

సీఎం జగన్‌ది ప్రజారంజక పాలన

అంకుపాలెంలో విప్ ధర్మశ్రీ పల్లెనిద్ర



అంకుపాలెంలో ఓ ఇంట్లో పల్లె నిద్ర చేస్తున్న విప్ ధర్మశ్రీ, స్థానిక నాయకులు

చోడవరం: ప్రజల కోసమే పనిచేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమంలో భాగంగా బుధవారం అంకుపాలెం గ్రామంలో జనంతో మమేకమయ్యారు. గ్రామంలోని పలు వీధుల్లో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. ఇంటింటా ప్రచారంలో భాగంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనితీరు, సీఎం జగన్ అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల స్పందన తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. గ్రామంలో ప్రధాన రోడ్లు, కాల్వలను నిర్మించాలని కోరారు. ప్రజల సమస్యలపై ధర్మశ్రీ సానుకూలంగా స్పందించారు. అంతకు ముందు పార్టీ జెండాను ఎగురవేశారు. గడచిన నాలుగున్నరేళ్లలో గ్రామానికి అందించి అభివృద్ధి, సంక్షేమ నిధుల వివరాలతో ఏర్పాటు చేసిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో భాగంగా స్థానికుని ఇంట్లో భోజనం చేసి, అక్కడే పల్లె నిద్ర చేశారు. ఆయనతోపాటు సర్పంచ్ నాగులాపల్లి రాంబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, ఎంపీటీసీ కోరుకొండ శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకుడు ముర్రోతు ముత్యాలనాయుడు పాల్గొన్నారు.

వలంటీర్ ఔదార్యం



పక్షవాత రోగి శివాలక్ష్మికి రూ.5 వేలు అందిస్తున్న వలంటీర్ లక్ష్మీ ప్రసన్న

మునగపాక: మండలంలోని ఉమ్మలాడ వలంటీర్ సూరిశెట్టి లక్ష్మీప్రసన్న తన ఔదార్యాన్ని చాటుకున్నారు. తనకు అప్పగించిన 50 కుటుంబాలకు అందించే సేవలతో పాటు తన పరిధిలో ఇబ్బందులు పడుతున్న వారికి సాయం చేస్తూ అండగా నిలుస్తున్నారు. ఇటీవల సర్పంచ్ సూరిశెట్టి గంగాయమ్మ గ్రామంలో ఆరోగ్య సమస్యలను తెలుసుకునేందుకు వలంటీర్‌తో కలిసి ఇంటింటికీ వెళ్లారు. గిడుతూరి శివాలక్ష్మి పక్షవాతంతో అనకాపల్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు గుర్తించారు. పేదరికంలో ఉన్న శివాలక్ష్మి యోగక్షేమాలను తెలుసుకోవాలని వలంటీర్‌కు సర్పంచ్ సూచించారు. దీంతో వలంటీర్ లక్ష్మీప్రసన్న బుధవారం ఆస్పత్రికి వెళ్లి తనకు వచ్చే గౌరవ వేతనం రూ.5 వేలును బాధిత మహిళకు అందించి మానవత్వం చాటుకున్నారు. పేదలకు సేవ చేయడంతోపాటు, వారి అవసరాలను గుర్తించి అండగా నిలుస్తున్న వలంటీర్ ప్రసన్నను స్థానికులు అభినందించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

ఎస్పీ కేవీ మురళీకృష్ణ



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ కేవీ మురళీకృష్ణ

పాయకరావుపేట: రోడ్డు ప్రమాదాలపై దృష్టి సారించామని జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా పాయకరావుపేట పోలీసు స్టేషన్‌ను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు గతంలో కన్నా తగ్గాయన్నారు. జిల్లాలో 43 ప్రమాద స్థలాలను గుర్తించామన్నారు. ట్రాఫిక్, ట్రాఫిక్ రూల్స్, రోడ్డు పక్కన వాహనాలు నిలుపుదల నివారణ, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై అవగాహన కల్పిస్తామన్నారు. అదే విధంగా గంజాయి రవాణాపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. జిల్లా సరిహద్దు ప్రాంతం పాయకరావుపేటలోని గంజాయి రవాణా మార్గాలపై దృష్టి సారించినట్లు తెలిపారు. నర్సీపట్నం, పాయకరావుపేట రోడ్లపై తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 4 చెక్‌పోస్టులు ఉన్నాయన్నారు. స్పందనలో ప్రజల వద్ద నుండి వచ్చిన ఫిర్యాదులను పరిశీలిస్తామన్నారు. అనంతరం పోలీసు స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేశారు. సీఐ పి.అప్పలరాజు, ఎస్‌ఐలు ఎస్.రమేష్, బి.జోగారావు, ఏఎస్‌ఐ గోవిందు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చని కుటుంబంలో పెనువిషాదం

- గ్యాస్ ప్రమాద బాధితులు నలుగురూ మృతి
- నాలుగు రోజుల వ్యవధిలోనే కుటుంబం కనుమరుగు
- వాంబేకాలనీలో అలుముకున్న విషాదం
- కాలనీవాసుల చందాలతో అంత్యక్రియలు



తండ్రి బాలరాజుతో పెద్ద కుమారుడు గిరి, చిన్న కుమారుడు కార్తీక్‌తో తల్లి చిన్ని



ప్రమాద సమయంలో ఇంటిలో మంటలు

మధురవాడ/పీఎం పాలెం : ఆనందాల పొదరిల్లు అగ్నికి ఆహుతైపోయింది.. జీవితంపై ఎన్నో ఆశలు.. మరెన్నో కలలతో రెక్కల కష్టంతో ముందుకు సాగుతున్న ఆ కుటుంబం కలలన్నీ అగ్నికీలల్లో బూడిదైపోయాయి.. చేతికి అందొచ్చిన కుమారులను చూసుకుని మురిసిపోతున్న తల్లిదండ్రులను... ఆ తల్లిదండ్రులకు ఏ కష్టం రాకుండా వారు హాయిగా శేష జీవితం గడిపితే చూడాలనుకున్న కుమారులపై విధి కన్నెర్ర చేసింది.. ఒకరి వెంట ఒకరుగా వారం రోజుల వ్యవధిలో నలుగురినీ గ్యాస్ ప్రమాదం రూపంలో కబళించింది. బతుకుతెరువు కోసం నగరానికి పొట్ట చేత పట్టుకుని వచ్చిన ఈ కుటుంబం అర్ధంతరంగా కనుమరుగవడంతో మధురవాడ వాంబే కాలనీలో విషాదం నెలకొంది. వారం రోజుల కిందట ఇంటిలో గ్యాస్ లీకై సంభవించిన ప్రమాదంలో తల్లిదండ్రులు, వారి ఇద్దరు కుమారులు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు. ఈ విషాద ఘటనకు సంబంధించి స్థానికులు, పీఎం పాలెం సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం...

రెక్కల కష్టంతో జీవనం

విజయనగరం జిల్లా భోగాపురం మండలం సవరవిల్లి గ్రామానికి చెందిన యామల బాలరాజుకు అదే జిల్లా చింతలవలస సమీపంలోని బెల్లాంకు చెందిన చిన్నితో గతంలో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు గిరి, కార్తీక్. వారికి మంచి భవిష్యత్ అందించాలన్న ఉద్దేశంతో బతుకుతెరువు కోసం పిల్లలను తీసుకుని విశాఖ నగరానికి వలస వచ్చేశారు. అలా పలుచోట్ల జీవించి 15 ఏళ్ల నుంచి మధురవాడ సమీప వాంబేకాలనీలో బ్లాక్ నంబర్ 27 బీలోని ఎఫ్ఎఫ్ 1, 2 ఇళ్లలో అద్దెకి ఉంటున్నారు. భార్య చిన్ని ఇళ్లల్లో పనులు చేస్తుండగా, బాలరాజు కార్పెంటర్. కుమారులు గిరి ఓ కంపెనీ ఫుడ్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తుండగా, కార్తీక్ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. బాలరాజు, గిరి, కార్తీక్ కొద్ది రోజుల కిందట భవానీ మాల ధరించారు.

గ్యాస్ సిలిండర్ పిన్ బ్లాక్ అవ్వడంతో..

ఈ నెల 24న శుక్రవారం ఉదయం ఎఫ్ఎఫ్ 2 ఇంట్లో భవానీ మాలధారుల కోసం ప్రసాదం తయారు చేస్తున్నారు. ఆ సమయంలో సిలిండర్‌లో గ్యాస్ అయిపోవడంతో మరో సిలిండర్ అమర్చే క్రమంలో దాని పిన్ లోపలికి వెళ్లిపోయి బ్లాక్ అయిపోయింది. దీంతో బాగా గ్యాస్ లీకయింది. ఆ సమయంలో ఏమీ కనిపించక లైట్ వేయడంతోపాటు గదిలో దీపం కూడా ఉండడంతో... అప్పటికే ఇళ్లంతా వ్యాపించిన గ్యాస్ అంటుకుని అగ్నికీలలు ఎగసిపడ్డాయి. మంటలను ఆర్పేందుకు కుటుంబ సభ్యులంతా తీవ్రంగా యత్నించినా ప్రయోజనం లేకపోయింది. ఈ క్రమంలో నలుగురూ మంటల్లో తీవ్రంగా కాలిపోయారు. గమనించిన స్థానికులు వెంటనే 108 సాయంతో కేజీహెచ్‌కు తరలించారు. మరోవైపు అగ్నిమాపక శకటం మంటలను ఆర్పడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

క్లుప్తంగా

3న జిల్లా స్థాయి నృత్యపోటీలు

అనకాపల్లిటౌన్: జిల్లాస్థాయి నృత్య పోటీలు డిసెంబర్ 3న గవరపాలెం కామాక్షిదేవి అమ్మవారి ఆలయ ఆవరణలో నిర్వహించనున్నట్లు అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ల ప్రవీణ్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సెమీ క్లాసికల్ అండ్ వెస్ట్రన్ ఫోక్, ఫోక్ గ్రూప్ డ్యాన్స్, కూచిపూడి పోటీలు ఉంటాయన్నారు. సబ్ జూనియర్ విభాగంలో 5 నుంచి 8 ఏళ్లు, జూనియర్స్‌లో 9 నుంచి 12, సీనియర్స్‌లో 13 నుంచి 16 ఏళ్ల వయసున్నవారు పాల్గొనవచ్చన్నారు. పోటీల్లో పాల్గొనే ప్రతి ఒక్కరికి ప్రత్యేక బహుమతులు, ప్రశంసా పత్రం అందిస్తామన్నారు. వివరాలకు 81215 21566 నంబర్లో సంప్రదించాల్సిందిగా కోరారు.

గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడిగా రేజేటి



రేజేటి మారుతీ వెంకటాచార్యులను అభినందిస్తున్న సభ్యులు

కశింకోట: మండల గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం నూతన అధ్యక్షుడిగా రేజేటి మారుతీ వెంకటాచార్యులు ఎన్నికయ్యారు. బుధవారం నిర్వహించిన సంఘ సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శులుగా గంటి శ్రీనివాసరావు, కొడుకుల బాలకృష్ణ, గౌరవాధ్యక్షుడిగా న్యాసావర్జుల ప్రశాంత్ శర్మ, గౌరవ సలహాదారుగా గుల్లపల్లి ప్రసాద్ ప్రాంతీయ జోనల్ సభ్యుడిగా మధిర ఫణి కుమార్‌శర్మ ఎన్నికయ్యారు.

నేడు 'వై ఏపీ నీడ్స్ జగన్'

అనకాపల్లిటౌన్: ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమాన్ని పట్టణంలోని సచివాలయం-12 నెయ్యిలవీధి, మండలంలోని కుంచంగి గ్రామాలలో గురువారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, ఎంపీపీ గొర్లి సూరిబాబులు బుధవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు సచివాలయాల పరిధిలో చేపట్టిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ లబ్ధి డిస్‌ప్లే బోర్డు, పార్టీ జెండా ఆవిష్కరణ చేసి, ఇంటింటికీ వెళ్లి టీడీపీ పాలన, ప్రస్తుతపాలన మధ్య వ్యత్యాసాలను వివరించి, సంక్షేమ పథకాల బ్రోచర్లను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. రాత్రికి అక్కడే పల్లెనిద్ర చేసి, మరుసటిరోజు ప్రజల సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు హాజరుకావాల్సిందిగా కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 2,798బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	3,900	4,240
రెండో రకం	3,750	4,080
మూడోరకం	3,450	3,740

అనకాపల్లి సినిమాలు

ఆదికేశవ	: రాజా
మా ఊరి పొలిమేర-2	: సత్యనారాయణస్క్రీన్-1
స్పార్క్	: సత్యనారాయణస్క్రీన్-2
జిగర్ తండ	: షిర్డిసాయి
కోటబొమ్మాళి	: పర్తిసాయి
-------	: వెంకటేశ్వర
సౌండ్‌పార్టీ	: శ్రీసత్య
మంగళవారం	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 18 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-3 యూనిట్లు, ఓ పాజిటివ్-10 యూనిట్లు, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైనవారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 464 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 391 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.



నా పేరు కందుల శ్యామల. అనకాపల్లి పట్టణం. నా భర్త రోజు కూలీ. మాకు ఇద్దరు పిల్లలు. రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబం మాది. ఆర్థిక ఇబ్బందులతో నా కూతురు అఖిల చదువు ఇంటర్‌లోనే ఆపేయాలనుకున్నాం. సీఎం జగనన్న ప్రభుత్వం వసతి దీవెన ఇవ్వడంతో డిగ్రీ చదివించుకోగలగుతున్నాం. మాలాంటి నిరుపేద కుటుంబాలకు ఈ ప్రభుత్వం ఎంతగానో ఆదుకుంటుంది. గతంలో అమ్మఒడి, ఇపుడు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు విద్యాదీవెన, వసతి, భోజన ఖర్చులకు వసతి దీవెన అందిస్తున్నారు. ఏ సంవత్సరమూ డబ్బులు పడలేదన్న మాట లేదు. నేరుగా నా బ్యాంక్ ఖాతాలోనే డబ్బులు పడుతున్నాయి. వాటితో మా పిల్లలను ధైర్యంగా చదివించుకోగలుగుతున్నాం. ఈ ఏడాదితో నా కుమార్తె డిగ్రీ పూర్తవుతుంది. తను ఉన్నత చదువులు చదువుతానన్నా మాకు భయం లేదు. అందంతా జగనన్న ప్రభుత్వం మాలాంటి పేదలకిస్తున్న భరోసా. మళ్లీ మళ్లీ జగనే సీఎం కావాలన్నది మా ఆకాంక్ష.

ఉన్నత విద్యకు.. జగనన్న వసతి దీవెన

- పేద పిల్లల చదువుకు ఆర్థిక భరోసా
- ఉన్నత విద్యకు పెరిగిన ఆసక్తి

పేదరికం కారణంగా ఏ ఒక్కరూ ఉన్నత విద్యకు దూరం కారాదు. అదే లక్ష్యంతో జగనన్న వసతి దీవెనను సీఎం జగన్ అమల్లోకి తెచ్చారు. ఇప్పటికే అమ్మఒడి పథకంలో ఇంటర్ వరకు విద్యార్థుల వరకు ఆర్థిక సాయం అందుతోంది. వసతి దీవెనలో ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఆపై కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ఆర్థిక సాయం అందుతోంది. పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో జగనన్న విద్యా దీవెన పథకం అమల్లో ఉండగా, వసతి దీవెనలో విద్యార్థుల భోజనం, వసతి సౌకర్యాలకు సాయం చేస్తున్నారు.





పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాల తరగతి గదిలో విద్యార్థులు

అనకాపల్లిటౌన్: అనకాపల్లి నియోజకవర్గంలో జగనన్న వసతి దీవెన కింద సుమారు 5,500 మంది విద్యార్థులు లబ్ధి పొందుతున్నారు. పేద విద్యార్థులకు చదువులకయ్యే ఖర్చును ప్రభుత్వం జగనన్న విద్యా దీవెన ద్వారా రీయింబర్స్ చేస్తోంది. దీంతోపాటు భోజనం, వసతి భారం తల్లిదండ్రులపై లేకుండా ప్రభుత్వం వసతి దీవెనకు శ్రీకారం చుట్టింది. ఈ పథకంలో ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఆపై కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ఏటా రెండు విడతలుగా ఆర్థిక సాయం చేస్తోంది. అమ్మఒడి మాదిరిగానే విద్యాదీవెన, వసతిదీవెన నిధులను తల్లిదండ్రుల బ్యాంక్ ఖాతాల్లోనే జమచేస్తున్నారు.



వసతి దీవెన చెక్‌ను విద్యార్థులకు అందిస్తున్న జేసీ జాహ్నవి(ఫైల్)

పథకం అందుతోందిలా..

- శ్రీకారం: 24 ఫిబ్రవరి 2020
- అర్హులు: ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ తత్సమాన, ఆపై కోర్సులు
- లబ్ధి(ఏడాదికి): ఐటీఐకు రూ.10 వేలు; పాలిటెక్నిక్‌కు రూ.15 వేలు; డిగ్రీ, ఆపై కోర్సులకు రూ.20 వేలు

నియోజకవర్గంలో వసతి దీవెన లబ్ధి(రూ.కోట్లలో)

సంవత్సరం	అనకాపల్లి జోన్		అనకాపల్లి మండలం		కశింకోట మండలం	
	విద్యార్థులు	లబ్ధి	విద్యార్థులు	లబ్ధి	విద్యార్థులు	లబ్ధి
2019–20	2,143	1.88	1,708	1.54	1,186	1.11
2020–21	2,143	2.00	1,946	1.78	1,408	1.32
2021–22	2,104	1.97	2,063	1.88	1,542	1.44
2022–23	1,840	1.72	1,969	1.78	1,497	1.37

ఉన్నత విద్యకు వరం



ఇంటిల్లపాదీ పనిచేస్తేగానీ రోజు గడవని పరిస్థితి. నా కూతురు చందన బాగా చదువుతుంది. కనీసం మా బిడ్డనైనా మంచి చదువులు చదివించాలనుకున్నాం. ఇంటర్ తర్వాత బిడ్డ చదువెలా? అన్న భయం అప్పట్లో ఉండేది. ఏదైనా సంబంధం చూసి పెళ్లి చేసేద్దామన్న ఆలోచన కూడా చేశాం. జగనన్న సీఎం అయ్యాక విద్యా దీవెన, వసతి దీవెనతో ఆ భయం పోయింది. ప్రభుత్వం ఇచ్చిన భరోసాతోనే నా బిడ్డను ఇంజినీరింగ్‌లో చేర్పించగలిగాను. ఇపుడు తను సెకండియర్ చదువుతోంది. ఉన్నత విద్య చదవాలనుకునేవారికి వసతి దీవెన వరంలా మారింది. జగనన్నకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటాం.

– కోట్ని అరుణకుమారి, అనకాపల్లి)

రూ.38 లక్షలతో ఎల్లయ్య కాలువపై బ్రిడ్జి



బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి

అనకాపల్లిటౌన్: జోన్ పరిధిలో దశలవారీగా అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి అన్నారు. స్థానిక వేల్పులవీధి సీతారామ కల్యాణమండపం వద్ద ఎల్లయ్యకాలువపై రూ.38 లక్షల నిధులతో కొత్త బ్రిడ్జి నిర్మాణ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సహకారంతో ఎన్నోఏళ్లుగా శిథిలావస్థకు చేరిన బ్రిడ్జి స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మాణానికి మార్గం సుగమమైందన్నారు. భావితరాల ప్రజలను దృష్టిలో పెట్టుకుని బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలని కాంట్రాక్టర్లను సూచించారు. వేల్పులవీధిలో రోడ్లు, డ్రైనేజీలు, బోర్లు, సెంటర్ లైటింగ్ పోల్స్‌తో అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి జాజుల రమేష్, జీవీఎంసీ ఏఈ సుమిత్ర, పార్టీ నేతలు ఉగ్గిన అప్పారావు, బొండా శంకరరావు, మద్దాల రమణబాబు, వేల్పుల గణేష్, బొండా వాసు, కొంకి శ్రీరామమూర్తి, వీధి పెద్దలు వాకాడ బాబు, గరికి వెంకటరావు, ముత్తా ఈశ్వరరావు, వలంటీర్లు పాల్గొన్నారు.

లేగదూడల ప్రదర్శనకు విశేష స్పందన



లేగ దూడల ప్రదర్శనను పరిశీలిస్తున్న ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామ్మోహన్ రావు

సబ్బవరం: మండలంలోని ఇరువాడ పాల సొసైటీ ఆవరణలో జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన (సంకర జాతి ఆవుల) లేగ దూడల ప్రదర్శనకు రైతుల నుంచి విశేష స్పందన లభించింది. 100 మంది రైతులు తమ లేగ దూడలను తీసుకొచ్చారు. అత్యంత ఆసక్తికరంగా జరిగిన ఈ లేగ దూడల ప్రదర్శనలో బలిరెడ్డి సూరిబాబుకు చెందిన హెచ్ ఎఫ్ ఎక్స్16 జాతికి చెందిన లేగ దూడ మొదటి బహుమతి కైవసం చేసుకుంది. బలిరెడ్డి నాగరాజుకు చెందిన జేఎక్స్21 జాతికి చెందిన ఆవు దూడ ద్వితీయ బహుమతి గెలుచుకుంది. మజ్జి రాము అనే రైతుకు చెందిన ఎం 30 జాతి దూడ తృతీయ స్థానంలో నిలిచింది. విజేతలైన రైతులకు జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు బహుమతులు అందజేశారు. ప్రదర్శనలో పాల్గొన్న రైతులందరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రామ్మోహన్ రావు మాట్లాడుతూ సంకరజాతి పశువుల ద్వారా అత్యధిక పాల ఉత్పత్తిని సాధించేందుకు గ్రామీణ ప్రాంత రైతులకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. పంటల కంటే పశు పోషణ మీద ఆదాయం అధికంగా లభిస్తుందని ఆయన అన్నారు. దేశవాళీ జాతులకు చెందిన ఆవులు, గేదెల కన్నా సంకర జాతికి చెందిన సంతతిని ఉత్పత్తి చేసుకుంటే భవిష్యత్తులో రైతులు అత్యధిక లాభాలు సాధించే వీలుంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్. కరుణాకరరావు, సబ్బవరం వెటర్నరీ ఉప సంచాలకురాలు డాక్టర్ కె.ఉషా కుమారి, మండల పశు వైద్యాధికారి డాక్టర్ స్వర్ణలత, అంతకపల్లి, గుల్లేపల్లి, డీఎల్‌డీఏ పశువైద్యాధికారులు ఎస్.సౌజన్య, అరుణ, బి.సంధ్య, శ్రీనివాసరావు, పాల సొసైటీ అధ్యక్షుడు సంగ్రాన అప్పారావు, నాయకులు కనకరాజు, ఎంపీటీసీ కర్రి అప్పారావు, గ్రామ పెద్దలు మామిడి బంగారునాయుడు, దాడి సత్యనారాయణ, గళ్ల గోవింద, బలిరెడ్డి సూర్యప్రసాద్, బలిరెడ్డి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కొండకర్ల ఆవను పరిశీలించిన అధికారులు



కొండకర్ల ఆవ రెగ్యులేటరీ గేట్‌ను పరిశీలిస్తున్న జలవనరుల శాఖ అధికారులు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని కొండకర్ల ఆవ పరిసరాలను జలవనరుల శాఖ అధికారులు బుధవారం పరిశీలించారు. ఆవను అభివృద్ధి చేయాలని ఇటీవల పార్లమెంటులో స్థానిక ఎంపీ సత్యవతి చేసిన వినతి మేరకు పూర్తి వివరాలపై ప్రభుత్వాలు ఆదేశించిన నేపథ్యంలో జలవనరుల శాఖ అధికారులు రంగంలోకి దిగి, వివరాలు సేకరించారు. కార్యక్రమంలో జలవనరుల శాఖ ఎస్‌ఈ సూర్యకుమార్, డీఈ స్వామి నాయుడు, ఏఈ లోకేష్, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు చేరిన క్రీడా సామగ్రి



హెచ్ఎంకు క్రీడా సామగ్రి అందిస్తున్న దృశ్యం

నక్కపల్లి: వచ్చే నెల ప్రారంభం కానున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి సంబంధించి క్రీడా సామగ్రిని ప్రభుత్వం సరఫరా చేసింది. డిసెంబరు 15 నుంచి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా క్రీడా సంబరాన్ని నిర్వహిస్తోంది. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ పోటీలు ఫిబ్రవరి 3 వరకు దాదాపు 50 రోజుల పాటు కొనసాగుతాయి. విజేతలకు రూ.10 వేల నుంచి రూ. 5 లక్షల వరకు ప్రైజ్‌మనీ ప్రకటించింది. డీఎల్ పురం పాఠశాలకు సరఫరా అయిన క్రీడా సామగ్రిని పేరెంట్స్ కమిటీ చైర్మన్ ప్రసాదుల శ్రీను ఉపాధ్యాయులకు అందజేశారు.

గౌరమ్మకు సారె సమర్పణ



తిమ్మరాజుపేటలో సారె ఊరేగిస్తున్న భక్తులు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో బుధవారం గౌరీ పరమేశ్వరుల సారె ఊరేగింపు నిర్వహించారు. గ్రామానికి చెందిన ముత్తయిదువలు వండిన పిండివంటలతో పాటు ఫలాలు, ఇతర సారె సామాగ్రిని గ్రామ పెద్దల ఆధ్వర్యంలో తిమ్మరాజుపేట వీధుల్లో ఊరేగించి, అమ్మవారికి సమర్పించారు.

జగన్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమం

వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో నేతలు



తాకాశివీధి సచివాలయంలో సంక్షేమ లబ్ధి డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న జానకీరామరాజు



కొత్తూరులో సంక్షేమ పథకాల లబ్ధి ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



గాంధీబొమ్మ జంక్షన్ వద్ద పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న జానకీరామరాజు



చింతలపాలెం సచివాలయంలో సంక్షేమ లబ్ధి డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న శ్రీధర్‌రాజు

అనకాపల్లిటౌన్: అర్హతే కొలమానంగా అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సకాలంలో అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని పార్టీ పట్టణ అధ్యక్షుడు, జోన్ జేఏసీ కన్వీనర్ మందపాటి జానకీరామరాజు అన్నారు. పట్టణ పరిధి సచివాలయం-11 తాకాశివీధిలో ఏపీకీ జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమం పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ అధ్యక్షతన బుధవారం జరిగింది. ముందుగా సచివాలయ పరిధిలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల లబ్ధి రూ.13.37 కోట్ల నిధుల వివరాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. సచివాలయ పరిధిలో ప్రజలకు చేకూరిన లబ్ధిని అంశాల వారీగా వివరించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డినే సీఎంగా గెలిపించి, మరిన్ని సంక్షేమ పథకాలు, అంతకు మించిన అభివృద్ధి ఫలాలను అందుకోవాలని కోరారు. సంక్షేమ పథకాల్లో ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే జమ చేస్తున్న ఏకైక ప్రభుత్వం దేశంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనన్నారు. టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీల దోపిడీ, పింఛన్ కోసం అవ్వాతాతలు పడిన ఇబ్బందులను గుర్తు చేశారు.

పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పాలన జరుగుతోందన్నారు. పట్టణాన్ని దశలవారీగా అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గాంధీబొమ్మ సెంటర్‌లో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించి, గడప గడపకు వెళ్లి ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే.. బ్రోచర్లను అందించి, ప్రజల స్పందనను తెలుసుకున్నారు. అక్కడే రచ్చబండ కార్యక్రమాన్ని చేపట్టారు. అంతకు ముందు జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో 84వ వార్డు ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ, పార్టీ నేతలు కారుకుండి కన్నబాబు, తాకాసి నాగేశ్వరరావు, బేతి ఈశ్వరరావు, నుదురుపాటి తాతాజీ, మాధురి నాయుడు, గుండా రమేష్‌గుప్తా, బుగత అశోక్, కొప్పర్తి వెంకటరాజు, సచివాలయం ఉద్యోగులు, గృహసారథులు, వలంటీర్లు, పార్టీ అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

అనకాపల్లి రూరల్: సంక్షేమ రథసారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు సాధ్యమని ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని కొత్తూరు-2 సచివాలయం పరిధిలో జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌తోనే రాష్ట్ర ప్రజలకు మంచి జరుగుతుందన్నారు. నాలుగున్నరేళ్లలో అందించిన సంక్షేమ పథకాల లబ్ధి వివరాలతో రూపొందించిన డిస్‌ప్లే బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పెద్దిశెట్టి గోవింద్, జగన్‌మోహన్‌రెడ్డి, పెతకంశెట్టి శివసత్యనారాయణ, జోసెఫ్, సర్పంచ్ సప్పారపు ప్రసన్న లక్ష్మి, ఎంపీటీసీ వెలుగుల లక్ష్మి, అనపర్తి శ్రీనివాసరావు, ఎంపీడీవో కేవీ నరసింహారావు, ఈవోపీఆర్డీ కె.ధర్మారావు, పార్టీ స్థానిక నాయకులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కశింకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తూ ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు అన్నారు. మండలంలోని చింతలపాలెం సచివాలయం పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా నాలుగున్నరేళ్లలో చేపట్టిన పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును మండల సచివాలయాల కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ సీఎం జగన్ అమలు చేశారన్నారు. నవ రత్నాలతోపాటు పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ, మరో వైపు రాష్ట్రాభివృద్ధికి చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిచ్చిన ప్రభుత్వం తమదేనన్నారు. ఇందులో భాగంగానే సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ నిధులతో సిమెంట్ రోడ్లు, కాలువలు నిర్మించినట్లు వెల్లడించారు. సర్పంచ్ కొట్టి రాము అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, ఈవోఆర్డీ సోమరాజు, పార్టీ స్థానిక నాయకులు కోన నాగేశ్వరరావు, గోపి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

35 మందికి కంటి ఆపరేషన్లు



ఆపరేషన్ అనంతరం రోగులు

అచ్యుతాపురం(అనకాపల్లి): బ్రాండెక్స్‌లో కంటి పరీక్షలు చేయించుకుని శస్త్ర చికిత్సలకు సిఫారసు చేసిన వారికి విజయవంతంగా ఆపరేషన్లు నిర్వహించారు. గత ఆదివారం బ్రాండెక్స్‌లో నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. వారిలో 35 మందికి శస్త్రచికిత్స అవసరమని వైద్యులు సూచించారు. ఈ మేరకు వారిని విశాఖ తీసుకువెళ్లి, శస్త్ర చికిత్స పూర్తి చేసిన అనంతరం బ్రాండెక్స్‌కు, అనంతరం వారి ఇళ్లకు తరలించారు.

ప్రియురాలి చావుకు కారణమైన ప్రియుడి అరెస్టు

పరవాడ: ప్రియుడి మాయ మాటలు నమ్మి మోసపోయిన ఓ ప్రియురాలు బలవన్మరణానికి పాల్పడిన ఘటన పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. సీఐ పి.ఈశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన అరిజిల్లి శ్రీను, అదే గ్రామానికి చెందిన కొవిరి ప్రియాంక కొన్నేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. శ్రీను పెళ్లి చేసుకుంటానని నమ్మించి అవసరం తీర్చుకున్నాడు. ఇటీవల ప్రియాంక తనను పెళ్లి చేసుకోవాలని శ్రీనును కోరగా నేను నిన్ను పెళ్లి చేసుకోను, చస్తే చావు అని వెళ్లిపోయాడు. దీంతో ప్రియాంక ఈ నెల 14 న సాయంత్రం 4 గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. వాకిట్లో వాంతులు చేసుకుంటుండగా స్పందించిన కుటుంబ సభ్యులు ఆటోలో వాడచీపురుపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం ఇంటికి చేరుకుంది. ఇంటికి చేరుకున్న తర్వాత పరిస్థితి విషమించడంతో గాజువాకలోని ప్రైవేటు ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ కూడ ప్రియాంక ఆరోగ్యం కుదుట పడకపోవడంతో 21న విశాఖ కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఈ నెల 27న ఉదయం 11 గంటలకు ప్రియాంక మృతి చెందింది. తమ కుమార్తె మృతికి ప్రియుడు అరిజిల్లి శ్రీను కారణమని మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు శ్రీనును అదుపులోకి తీసుకుని, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఈశ్వరరావు చెప్పారు.

పల్లెలకు మార్గదర్శకంగా ఆలయాలు



శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే బాబూరావు

కోటవురట్ల: కె.వెంకటాపురంలో నూకాలమ్మతల్లి ఆలయ నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టారు. వేద పండితుల మంత్రోచ్ఛరణతో ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్, ఎంపీటీసీ కాళ్ల రత్నం పాల్గొన్నారు.

ఉపాధి పనులపై గ్రామ సభ నేడు

కశింకోట: స్థానిక పంచాయతీ కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు గ్రామ సభ నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు బుధవారం తెలిపారు. ఈ సమావేశంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టనున్న పనుల గురించి చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది హాజరు కావాల్సిందిగా కోరారు.